క్లుప్తంగా

ఘనంగా కాశీ విశ్వేశ్వర లింగ ప్రతిష్ట

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీ–2 పరిధిలోని సంపత్ వినాయక,కాశీ విశ్వేశ్వర లింగ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం జరిగింది. వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొని పూజలు చేశారు. సుమారు 3 వేల మందికి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎం.నాగేశ్వరరావు, సంజీవరావు, శ్రీనివాస్,నర్సింగరావు,శ్రీను,విజయకుమార్, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజల వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, రెవెన్యూకు 01, యూసీడీ విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ కె.శైలజ, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య


సాయి వివేక్ (ఫైల్)

గోపాలపట్నం: మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబంతో కలిసి గెద్దాడ సాయి వివేక్(27) సాకేతపురంలో నివాసముంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం సమీపంలో ఉంటున్న అత్తవారి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ హుక్కుకి ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చూడగా మృతి చెందాడు. దీంతో ఎయిర్‌పోర్టు పోలీసులకు సమచామందించారు. భార్యభర్తల మధ్య మనస్పర్థల వల్ల బలవన్మరణానికి పాల్పడ్డాడని చెబుతున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల కార్మిక వ్యవస్థపై పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డి.వెంకటేశ్వరి తదితరులు

ఎంవీపీకాలనీ: ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ రూపొందించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ భవన కార్యాలయంలో విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి డి.వెంకటేశ్వరి ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల సమష్టి కృషితోనే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. 18 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లలు పని చేయకూడదని చట్టంలో ఉందన్నారు. దాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరముందని వెల్లడించారు. ఎవరైనా ఈ చట్టాన్ని అతిక్రమిస్తే శిక్షార్హులన్నారు. ఈ కార్యక్రమంలో ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి, ఏపీ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బడి గంట మోగిన వేళ

- పాఠశాలల్లో పండగ వాతావరణం
- విద్యార్థులకు జేవీకే కిట్ల అందజేత
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు

జగనన్న విద్యా కానుక పంపిణీతో ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పండగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రెట్టించిన ఆనందంతో కార్యక్రమానికి తరలివచ్చారు. జగనన్న విద్యా కానుక కిట్‌లో యూనిఫాం, షూ, బెల్టు, బ్యాగు తదితర సామగ్రి చూసి విద్యార్థులు పులకించిపోయారు. థ్యాంక్యూ జగన్ మావయ్య అంటూ కృతజ్ఞతలు తెలిపారు. నాణ్యమైన విద్యకు ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.


చదువులో నిమగ్నమైన విద్యార్థులు


జగనన్న విద్యా కానుక అందిస్తున్న కార్పొరేటర్ సుధ


కరాసా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్


గోపాలపట్నం బాలురు పాఠశాలలో డిజిటల్ బోర్డును పరిశీలిస్తున్న హెచ్‌ఎం వేణుగోపాల్


ప్రతిజ్ఞ కార్యక్రమంలో విద్యార్థులు

మల్కాపురం: వేసవి సెలవులు ముగిశాయి. సోమవారం నుంచి బండి గంట మోగడంతో విద్యార్థులు తమ పాఠశాలల వైపు అడుగులు వేశారు. తొలి రోజు విద్యార్థులు స్వల్పంగా తరగతులకు వచ్చారు. వేసవి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టకపోవడంతో ఈ పరిస్థితి ఉంది. ఎండల దృష్ట్యా సోమవారం నుంచి శనివారం వరకు పాఠశాలలకు ఒంటి పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 7.20 నుంచి 11. 30 వరకు పాఠశాలలను నిర్వహించారు. ఈ నెల 19 నుంచి పూర్తి స్థాయి తరగతులు నిర్వహిస్తారు. మల్కాపురం,శ్రీహరిపురం,ప్రకాష్‌నగర్‌లోని జీవీఎంసీ పాఠశాలల్లో 60 శాతం విద్యార్థులు హాజరయ్యారు. ఒంటి పూట బడి ముగిసిన వెంటనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు.దీంతో పాటు చెక్కీలు పంపిణీ చేశారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ

మల్కాపురం: ప్రతి విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రుల కళ్లలో ఉన్నత విద్య అనే వరం ద్వారా వెలుగు నింపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. 61వ వార్డు పరిధి ప్రకాష్‌నగర్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల మాదిరిగా జీవీఎంసీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గాలికి వదిలేయకుండా నేడు ఉపాధ్యాయులకు బోధన నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో ఇలాంటి మంచి కార్యక్రమాలు జరిగాయా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సందడిగా పాఠశాలలు

గోపాలపట్నం: పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు విద్యార్థులతో సందడిగా మారాయి. గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లో విద్యార్థులు వేసవి సెలవులకు టాటా చెప్పి బడి బాట పట్టారు. మంగళవారం నుంచి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయనున్నామని ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు ఊపందుకుంటున్నాయి. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థినులు సందడి చేశారు.

డిజిటల్ బోర్డుల ఏర్పాటు

గోపాలపట్నం జిల్లా బాలుర ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. వీటి పనితీరును ప్రదానోపాధ్యాయుడు వేణుగోపాల్ పరిశీలించారు. ఈ బోర్డుల వల్ల బోధన పద్ధతిలో మంచి మార్పు వస్తుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

కరాసా పాఠశాలను పరిశీలించిన జియ్యాని

కరాసా జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. ఈ పాఠశాలకు జగనన్న విద్యా కానుక కిట్లు ఎన్ని వచ్చాయన్న అంశాలపై ఆరా తీశారు. పిల్లలకు ఇచ్చిన రాగి జావ, గోరుముద్ద పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పనుల ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల పాఠశాలలను జీవీఎంసీ కమిషనర్ పరిశీలించారని చెప్పారు. పాఠశాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో జియ్యాని మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు.


గోపాలపట్నం బాలికల పాఠశాలలో తరగతులకు హాజరైన విద్యార్థినులు

స్విమ్మింగ్‌పూల్‌లోనే తేజ మృతి!

- న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన
- అన్ని కోణాల్లో విచారించి న్యాయం చేస్తామని సీఐ హామీ


ఆందోళన చేస్తున్న తేజ బంధువులు

సింహాచలం: నాలుగు రోజుల క్రితం పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బాలుడు పళ్లా తేజ(5) కేసులో కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది. బాలుడు స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి చనిపోయినట్టు పోలీసులకు సమాచారం అందింది. తేజ చేతిపై గాట్లు కనిపించడంతో పాము కరిచి మృతి చెంది ఉంటాడని పోలీసులు తొలుత భావించారు. అయితే తేజ తల్లి ఎవరైనా చంపేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేయడంతో ఆ కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్న పెందుర్తి పోలీసులకు తేజ స్విమ్మింగ్‌పూల్‌లో పడి మృతి చెందాడని సమాచారం తెలిసింది. దీంతో పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్ఆర్ పురంలో ఉంటున్న పల్లా కనకరాజు, నారాయణమ్మ ఐదేళ్ల కుమారుడు పల్లా తేజ ఈనెల 8న సాయంత్రం 5 గంటల సమయంలో ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతికారు. జాడతెలియకపోవడంతో ఆరోజు రాత్రి 9.30 గంటల సమయంలో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆ రోజు రాత్రి గ్రామస్తులు, తేజ కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులు గ్రామంలో వెతికినా ఆచూకీ కానరాలేదు. 9వ తేదీ ఉదయం 5.20 గంటల సమయంలో తేజ ఎస్ఆర్‌పురం గ్రామంలోని పల్లా అప్పలనాయుడుకు చెందిన స్థలంలో శవమై కనిపించాడు. చేతిపై రెండు గాట్లు ఉండడంతో పాము కరిచినట్టు పోలీసులు ప్రాథమికంగా భావించారు. అయితే తేజ తల్లి మాత్రం తన కొడుకుది హత్య అని ఆందోళన వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలిచారు. ఇదిలావుండగా ఎస్ఆర్‌పురంలోని లెండీ వనం రిసార్టులో పనిచేస్తున్న తాడి నారాయణ అనే వాచ్‌మెన్ సోమవారం మధ్యాహ్నం ఒమ్మి సోంబాబు అనే వ్యక్తికి ఫోన్ చేసి తాము లేని సమయంలో తేజ స్విమ్మింగ్ పూల్‌లో దిగి మృతి చెందాడని తెలిపాడు. సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో స్థానికంగా సంచలనం రేకెత్తించింది. దీంతో తేజ బంధువులంతా తమకు న్యాయం చేయాలని పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. అన్ని కోణాల్లో విచారించి న్యాయం చేస్తామని సీఐ అప్పారావు తెలిపారు.

కాగా తేజ స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందాడని చెబుతున్న వాచ్‌మెన్ నారాయణ రెండు రోజులపాటు ఎవరికీ కనిపించకుండా వెళ్లిపోయినట్టు సమాచారం. తేజ మృతదేహాన్ని నారాయణే తీసుకొచ్చి అప్పలనాయుడు స్థలంలో పడేశాడన్న ప్రచారం కూడా జరుగుతోంది. సోమవారం పోలీసులను కలిసిన నారాయణ బాలుడు స్విమ్మింగ్ పూల్‌లో పడి మృతి చెందాడని చెప్పినట్టు తెలుస్తోంది.

కంటి శుక్లాలపై అవగాహన ఉండాలి

ఆరిలోవ: కంటి శుక్లాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ పంకజ్ పరశురాం తెలిపారు. ప్రతి జూన్ నెలను శుక్లాల మాసంగా గుర్తిస్తారు. దీంతో ఆస్పత్రిలో కొద్ది రోజులుగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన శుక్లాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. వయసు రీత్యా సాధారణంగా కంటిలో శుక్లాలు ఏర్పడతాయన్నారు. మధుమేహం, మూత్ర పిండాలు వ్యాధి, కంటి గాయాలు, కంటి ఇన్‌ఫెక్షన్ తదితర వాటితో బాధపడేవారితో పాటు ఏదైనా వ్యాధి కోసం దీర్ఘకాలిక మందులు వాడుతున్నవారిలో, పొగ తాగుతున్న వారిలోను ఈ శుక్లాలు పెరుగుతాయన్నారు. ఇవి వాహనాలు నడుపుతున్నప్పుడు, పుస్తకాలు చదువుతున్నప్పుడు ఆటంకంగా మారుతాయన్నారు. అందుకే వాటిని తొలగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం శుక్లాల శస్త్ర చికిత్స పురోగతి చెందిందన్నారు. శస్త్ర చికిత్స అనంతరం కంటి అద్దాలు లేకుండా సమస్య పరిష్కరించవచ్చన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్య దేవత బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరగనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,116 రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సైకిల్ రైడర్ సంపత్‌కు అభినందనలు


సైకిల్ రైడర్ సంపత్‌ను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: 'సే నో టు డ్రగ్స్' అనే నినాదంతో బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు సైకిల్ యాత్ర చేపట్టిన బుల్లయ్య కళాశాల విద్యార్థి సాయిసంపత్ ఈ నెల 2న విశాఖ చేరుకున్నాడు. యాత్ర విజయవంతంగా పూర్తి చేసిన సంపత్ సోమవారం కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన సంపత్‌ను ప్రత్యేకంగా అభినందించి యాత్రా విశేషాలను అడిగి తెలుసుకున్నారు. సైకిల్‌పై మే 8న విశాఖలో యాత్ర ప్రారంభించి 25 రోజుల పాటు సుమారు 2 వేల కిలోమీటర్లు ప్రయాణించి బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ సరిహద్దుల వరకు యాత్ర సాగించినట్టు తెలిపాడు. కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, స్నేహితుల సహకారంతో యాత్ర పూర్తి చేశానని, తెలుగు రాష్ట్రాల నుంచి సైకిల్‌పై మూడు సరిహద్దులను చేరుకున్న చిన్న వయస్కుడిగా రికార్డు సాధించానని చెప్పాడు. రోజూ 80 నుంచి 140 కిలో మీటర్లు ప్రయాణించే వాడినని.. తన యాత్ర అనుభవాలను వివరించాడు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు కార్యక్రమం నిర్వహించారు.

అట్టహాసంగా ఎర్నిమాంబ ఆలయ పునఃప్రారంభం

- ప్రత్యేక పూజలు చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆడారి ఆనంద్‌కుమార్


ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సుబ్బారెడ్డి


అన్నదానంలో పాల్గొన్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్, ఈవో సురేష్‌బాబా

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలోని ఎర్నిమాంబ ఆలయ పునఃప్రారంభం సోమవారం అట్టహాసంగా జరిగింది. విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులు రూ. 35లక్షల తో ఆలయ పునర్నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు పులఖండం శ్రీకాంత్‌శర్మ, వేదపండితులు గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు, అధివాసాలు, జలాధివాసం, క్షీరవాసం, ధాన్య,క్షయాధివాసాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.వెంకట సత్యసురేష్‌బాబా, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమశ్రీధర్, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చినట్టు ఆయన తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్‌రాజు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బెహరా భాస్కరరావు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్కాపురం: జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో సోమవారం శిఖర ప్రతిష్ట, ఆలయం పునఃప్రారంభం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పార్టీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి, 59వ వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్‌లతోపాటు పలు వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, ముర్రు వాణి తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న బద్రీనాథ్

క్రీడల్లో మరింత రాణించాలి


రోప్ స్కిప్పింగ్‌లో బంగారు పతకం సాధించిన మేరిని అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: క్రీడల్లో విద్యార్థులు మరింతగా రాణించాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. స్కిప్పింగ్‌లో బంగారు పతకం సాధించిన పాత గోపాలపట్నంకు చెందిన ఎస్‌మేరి కుటుంబ సభ్యులు సోమవారం ఈ మేరకు శాంతినగర్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పేద కుటుంబాల్లో పిల్లలు క్రీడలపై ఆసక్తి కలిగి ఉంటున్నారన్నారు. వారిని తగిన విధంగా ప్రోత్సహిస్తే మరింతగా ఎదుగుతారని చెప్పారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న మేరి ఇంటర్నేషనల్ రోప్ స్కిప్పింగ్ ఆర్గనైజేషన్ పర్యవేక్షణలో రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో ఈ నెల 3,5వ తేదీల్లో ముంబయ్‌లో రోప్ స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. 17 ఏళ్ల బాలికల విభాగంలో డబుల్ అండర్ 30 సెకెండ్స్ విభాగంలో బంగారు పతకం సాధించగా, స్పీడ్ స్ప్రింట్ 30 సెకెడ్స్ విభాగంలో వెండి పతకం దక్కించుకుంది. శ్రీధర్ అభినందించి రూ.5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.

నవదుర్గ.. చల్లగా చూడమ్మా

వేడుకగా అమ్మవారి మహోత్సవాలు ప్రారంభం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు


పూజ చేస్తున్న వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం కొండ ప్రాంతంలో కొలువుదీరిన నవదుర్గ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో అభిషేకాలు చేశారు. అమ్మవారి వెండి ఆభరణాలను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పి.గణబాబు,నాయకులు కోరాడ శ్రీను,రామ్మోహన్‌నాయుడు,లాలం లావణ్య తదితరులు పాల్గొన్నారు.అలాగే వైఎస్సార్‌సీపీ మహిళ నాయకురాలు,వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరక్టర్ చుక్క వరలక్ష్మి అమ్మవారి దర్శించుకుని పూజలు జరిపారు.

మనసుకు ఆనందాన్నిచ్చేది కవిత్వం


సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామితో కవులు, రచయితలు

సీతంపేట: కవిత్వం వింటే మనసుకు ఆనందం కలగాలని లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అన్నారు. లలితానగర్ లలితా పీఠం దర్బారు హాల్లో సోమవారం సాయంత్రం కవి సమ్మేళనం జరిగింది. అనంతరం కవులు, రచయితలను ఉద్దేశించి స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. ఆనందం అంటే మనసు పరవశించే స్థితని పేర్కొన్నారు. అందరి ఆనందాల కంటే బ్రహ్మానందం గొప్పదని, కవిత్వం, సంగీతం, లలిత కళల వల్ల కలిగే ఆనందం ఇంచుమించు బ్రహ్మానందంతో సమానమన్నారు. మనిషి ఎన్ని క్షణాలు ఆనందాన్ని అనుభవించాడో అదే నిజమైన జీవితమని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో చక్కని పద్య, గద్య కవిత్వంతో అలరించారన్నారు. ఆగస్టు 10న లలితా పీఠంలో నన్నయ్య సహస్రాబ్ది ఉత్సవాలు జరుపుకుందామని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి మహాస్వామిని, రచయితలు, కవులు డి.వి.సూర్యారావు, టి.పి. ఎన్.ఆచార్యులు, శేఖరమంత్రి ప్రభాకర్, చింతా ప్రభాకరరావు, రామతాత, చిన సూర్యనారాయణ, కావ్య, పిల్లా రమణమూర్తి, కళ్లేపల్లి వరలక్ష్మి, మరడాన సుబ్బారావు, కోరాడ నరసింహారావు, పద్మజ, ఎం.విజయగోపాల్, వేదుల కామేశ్వర శర్మ, గుండాన జోగారావు, సుజాతమూర్తి పాల్గొన్నారు.